క్లుప్తంగా

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గోకవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ కె.ప్రియదర్శిని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, గ్రంథాలయ ఉద్యమకారుల సన్మానసభ, కవి సమ్మేళనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, పాఠకులు ఈ వారోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైన శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి శనివారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. మాసశివరాత్రి సందర్భంగా ఈ అభిషేకాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమైన అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

న్యూడెమోక్రసీ నిరసన

మధురపూడి: గాజాపై ఇజ్రాయిల్ దాడులను నిలివేయాలని చేయాలని కోరుతూ శనివారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరుకొండలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాలస్తీనా సంపూర్ణ స్వాతంత్ర్య దేశం ఏర్పాటు కోసం జరుగుతున్న పోరాటాలను బలపర్చాలన్నారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఆ పార్టీ నాయకుడు పి.వెంకటనాయుడు మాట్లాడుతూ ఇజ్రాయిల్–పాలస్తీనా సమస్య పరిష్కారానికి ఐక్యరాజ్య సమితి చొరవతీసుకోవాలన్నారు. అనంతరం నరసింహస్వామి దేవస్థానం నుంచి కోరుకొండ బస్టాండ్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జనుపల్లి సత్తిబాబు, ఎస్.భాస్కర్, ఎస్.సూర్యనారాయణ, ఎం.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

రంగంపేట: మండలంలోని జి.దొంతమూరులో ఎటువంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కంచెర్ల శ్రీనివాసరావు అక్రమంగా బాణసంచా విక్రయిస్తుండటంతో అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ.5 వేల విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీపావళి సందర్భంగా మండలంలో ఐదు బాణసంచా దుకాణాలకు మాత్రమే అనుమతులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. మండల కేంద్రమైన రంగంపేటలో 4, వడిశలేరు గ్రామంలో ఒక షాపునకు అనుమతులు ఇచ్చామన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

గోకవరం: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా ఆర్.హరనాథ్, ప్రధాన కార్యదర్శిగా పీవీవీఎస్ఆర్ త్రిమూర్తులు, గౌరవాధ్యక్షుడిగా ఎస్.కుమార్, సహాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, ఎస్ సులోచన, ట్రెజరర్‌గా టీవీవీఆర్ఎస్ నారాయణరావు, ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ నూతన అధ్యక్షుడు హరనాథ్ మాట్లాడుతూ యూటీఎఫ్ బలోపేతంతో పాటు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.అనిల్‌కుమార్, ఈ.శ్రీమణి, ప్రేమ్‌కుమార్, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్పుల్లో జాగ్రత్తలు తీసుకోండి

మధురపూడి: బాణసంచా కాల్పుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు సూచించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ కోరుకొండ మండలంలో 15 బాణసంచా దుకాణాలకు అనుమతిచ్చామని, అగ్ని ప్రమాదాలకు తావివ్వకుండా వ్యాపారస్తులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలందరూ టపాసులు పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని కోరుకొండ, గాడాల, దోసకాయలపల్లి, గాదరాడ, శ్రీరంగపట్నం, బూరుగుపూడి గ్రామాల్లో 15 దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాణికుల ప్రయోజనార్థం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని డిపో మేనేజర్ షేక్ షబ్బం తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు వెల్లడించారన్నారు. బస్సుల్లో వెనుక సీట్లలో కూర్చునే ప్రయాణికుల సౌలభ్యం కోసం హ్యాండిల్స్ ఏర్పాటు చేయాలని కోరారన్నారు. నగరంలో సిటీ బస్సులు నడపాలని కొందరు సూచించారని, అయితే గతంలో నడపగా ప్రయాణికుల ఆదరణ లేక నష్టాలు వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో నగరంలో సిటీ బస్సులు నడిపే అవకాశం లేదన్నారు.

పాడికి భరోసా

- పశువుల్లో వ్యాధి నిర్ధారణ సులభతరం
- నియోజకవర్గ స్థాయిలో అగ్రి ల్యాబ్ ప్రయోగశాల
- తగిన మందులు, వైద్యం గుర్తింపు
- పాడి రైతుల పశు సంపద వృద్ధికి ప్రభుత్వ కృషి

పెదపూడి: మూగ జీవాలకు చిన్నపాటి వ్యాధి సంక్రమించినా పాడి రైతులు విలవిల్లాడుతుంటారు. పశువులకు సరైన వైద్యం లభించకపోతే మృత్యువాతకు గురవుతుంటాయి. ఇక నుంచి ఈ పరిస్థితి ఎదుర్కోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకర్గంలోని వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేసింది. ఇక్కడ పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులు తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిస్తారు. తద్వారా పశు పోషకులు తమ పశు సంపదను పరిరక్షించుకునే అవకాశం మెరుగుపడింది.

రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.57 లక్షలతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ ప్రయోగశాలల్లో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే తెగుళ్లపై ఓ వైపు ప్రయోగాలు చేస్తుండగా, మరోవైపు పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులపై ప్రయోగాలు చేస్తున్నారు. పశు సంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రయోగాలను ల్యాబ్ టెక్నీషియన్లు చేస్తుంటారు. నియోజకవర్గంలో అన్ని పశు వైద్యశాలల నుంచి అందే వ్యాధుల నమూనాలపై ప్రయోగాలు చేసి, వాటి నివేదికను ఏడీకి అందజేస్తారు. సకాలంలో వ్యాధుల నివారణకు మందులు అందజేయడంతో పశువుల మరణాలు తగ్గి, పశు సంపద వృద్ధి చెందేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షలు

రక్త పరీక్షలు 50 రకాలతో పాటు ఇతర పరీక్షలను ల్యాబ్‌లో చేస్తుంటారు. నియోజకవర్గంలోని పెదపూడి, అనపర్తి, రంగంపేట, బిక్కవోలు మండలాల్లోని పశు వైద్యశాలల నుంచి సేకరించిన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల తదితర వాటికి సంక్రమించే వ్యాధులపై పరీక్షలు చేస్తున్నారు. 2021 జూన్ నుంచి ఇప్పటివరకూ 3,263 పరీక్షలు చేశారు.

ప్రయోగాలు ఇలా..

పశువుల మూత్రం, పేడ, పాలు, రక్త పరీక్షలు, ర్యాబిస్, చీము, చీముడు, చర్మ సమస్యల నమూనాలను ఈ ప్రయోగశాలలో పరీక్షించి, వ్యాధి లక్షణాలు గుర్తిస్తారు. వీటితో పాటు పశువులకు పలు రకాల టీకాలు వేశాక, వాటి పనితీరు, పశువుల్లో ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం లాంటివి ఈ ప్రయోగశాలలో జరుగుతాయి. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులనూ గుర్తిస్తారు. ముఖ్యంగా బ్రెసిల్ వ్యాధిని గుర్తించడం (పునరుత్పత్తి లేకపోవడాన్ని) యాంటీ బయోటిక్ నిర్వహణ పరీక్షలు, పాలు, రక్త నమూనాలు సేకరించి, ఏ యాంటీ బయోటిక్ ఇస్తే పశువుకు వ్యాధి నయం అవుతుందో గుర్తిస్తారు. వ్యాధుల బారిన పడి చనిపోయిన పశువుల కళేబరాలకు పరీక్షలు లాంటివన్నీ ప్రయోగశాలలోనే చేస్తారు. గొర్రెలు, మేకలకు సోకే నట్టల(పారాసైట్స్) నిర్ధారణకు, దానికి తగిన మందులు ఇచ్చేందుకు ఇక్కడ ప్రయోగాలు జరుగుతాయి. కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలలో గుర్తిస్తారు. ఏటా ప్రయోగాల కోసం ఉపయోగించే రసాయన ద్రావణాలు, ఇతర పరికరాలను ప్రభుత్వం సమకూరుస్తుంది. పశు సంవర్ధక శాఖ వ్యాధి నిర్ధారణ జిల్లా ప్రయోగశాల నుంచి వీటిని సరఫరా చేస్తారు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట. పెదపూడి మండలాలున్నాయి. ఇక్కడున్న పశు వైద్యశాలల పరిధిలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
అనపర్తి	1256	8644	2954	621
పెదపూడి	2160	10445	29	542
బిక్కవోలు	1203	5798	8969	1707
రంగంపేట	7623	11045	3269	3123
మొత్తం	12,242	35,932	15,221	5993



అనపర్తిలోని అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

పాడి రైతులకు ఎంతో మేలు



పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సోకే వ్యాధి నిర్ధారణకు పరీక్షలు నిర్వహించి, వాటికి వైద్య సేవలు అందిస్తాం. రైతులకు నిత్యం ల్యాబ్ అందుబాటులో ఉంటుంది. గతంలో ఏ పరీక్ష చేయాలన్న జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి, రిపోర్టు వచ్చాక వైద్యం అందించేవారు. ప్రస్తుతం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటయ్యాక, ఇక్కడే అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నాం. రైతులు ఈ సేవలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఏడీప, అనపర్తి, తూర్పుగోదావరి జిల్లా

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు ఆయనకు ప్రజలు పూలవర్షంతో అపూర్వ స్వాగతం పలికారు. ప్రజలు, పార్టీ నాయకులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల సారథి, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. దేశంలోనే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలతో జనరంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్ మా గుండె చప్పుడని చెబుతున్నారన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, తంగేళ్ల రాజు, చిమ్మా శ్రీను, బొబ్బిలి సత్తిబాబు, కక్కల సత్తిబాబు, గుత్తికాల ఆంజనేయులు పాల్గొన్నారు.


వచ్చే నెల 10న కార్తిక వన సమారాధన



సమావేశంలో మాట్లాడుతున్న కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి

అనపర్తి: వచ్చే నెల 10వ తేదీన రెడ్డి సామాజికవర్గ కార్తిక వన సమారాధన నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి తెలిపారు. కార్తిక వనసమారాధన ఏర్పాట్లలో భాగంగా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరెడ్డి మాట్లాడుతూ అనపర్తి మండలం దుప్పలపూడిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న రహదారిలో గల నేషనల్ వెంకటరెడ్డి గారి మామిడ తోటలో వన సమారాధన జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పలువురు శాసనసభ్యులు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, వెలగల విజయాదిత్యరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



కారు ఢీకొనడంతో మృతి చెందిన బురిడి వెంకటరమణ

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి ఎదురుగా శనివారం వేరు వేరు సమయాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరు ఆస్పత్రిలో పని చేస్తున్న ఆయా కాగా, మరొకరు ఆస్పత్రికి వస్తున్న పేషెంట్. ఈ సంఘటనలకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. రంగంపేట మండలం, ఎస్టీ రాజాపురానికి చెందిన బురిడి వెంకటరమణ(62) జీఎస్ఎల్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తోంది. విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన క్రమంలో రోడ్డు దాటేందుకు డివైడర్ ఎక్కుతుండగా వెనుక నుంచి కారు ఢీ కొనడంతో ప్రమాదానికి గురై, ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.
దేవరపల్లికి చెందిన అంబటి సూర్యారావు(74) గుండె పరీక్షలు చేయించుకునేందుకు జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చాడు. బస్సు దిగి ఆస్పత్రిలోకి వెళ్తున్న అతనిని వెనుక నుంచి ఐషర్ వ్యాన్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

3,980 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



రాజమహేంద్రవరంలోని ఫుడ్ గోడౌన్‌కి తరలించిన బియ్యం వ్యాన్

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ వైద్య కళాశాల వద్ద 3,980 కిలోల రేషన్ బియ్యాన్ని (పీడీఎస్ రైస్) పౌరసరఫాల శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తున్న ఈ బియ్యం విలువ రూ.1.59 లక్షలు ఉంటుందని అంచనా. వాహనం డ్రైవర్ వద్ద దొరికిన బిల్లుల ఆధారంగా కృష్ణా జిల్లా నుంంంచి కాకినాడ పోర్టుకు బియ్యాన్ని తరలిస్తున్నారని స్థానిక ఎంఎస్‌ఓ కమల సుందర్ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రాజమహేంద్రవరంలోని ఫుడ్ గోడౌన్‌కి తరలించారు.

నకిలీ విలేకరుల బేరసారాలు

పీడీఎస్ బియ్యాన్ని పట్టుకోవడంలో పౌరసరఫరాలశాఖ అధికారుల కంటే కొందరు నకిలీ విలేకరులే ముందున్నారు. అనధికారికంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంతో కూడిన వాహనాన్ని తొలుత నలుగురు వ్యక్తులు ఆపి, రూ. 50 వేలు డిమాండ్ చేశారని స్థానిక ఎస్సై సుధాకర్ తెలిపారు. ఈ నలుగురిలో ఒకరు విజిలెన్స్ అధికారి కాగా, మిగిలిన ముగ్గురు విలేకరులుగా తనకు చెప్పినట్టు ఆ వాహనం డ్రైవర్ తెలిపాడన్నారు. అయితే తాము సంఘటనా స్థలానికి వెళ్లేసరికే ఆ నలుగురు పారిపోయారన్నారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగినట్టుగా తమ దృష్టికి వచ్చిందని, పరారైన వ్యక్తుల కోసం గాలిస్తున్నామన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి

- పుణ్యక్షేత్రంలో రూ.8.28 కోట్లతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



పుణ్యక్షేత్రంలో లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించేలా అవసరమైన నిధులను కేటాయించి, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. పుణ్యక్షేత్రంలో శనివారం ఐదో రోజు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. గ్రామంలో రూ.8.28 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామంలో అర్హులైన వారందరికీ త్వరలోనే నివాస స్థలాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, పుణ్యక్షేత్రం, సంపత్‌నగరం గ్రామ సర్పంచ్‌లు మరుకుర్తి వెంకటేశ్వరావు, పెంటగట్ల రామకష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావు, నాయకులు పేపకాయల రాంబాబు, శ్రీధర్, ఈశ్వర్రావు, పోతురాజు, వీరబాబు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పేలుతున్న ధరలు



రాజానగరంలో రావుల చెరువు గట్టున వెలసిన బాణసంచా దుకాణాల వద్ద విక్రయాల జోరు

బాణసంచా	గత ఏడాది	ఈ ఏడాది
కాకరపువ్వొత్తులు(7 సీఎం)	రూ. 200	రూ. 250
చిచ్చుబుడ్లు అరడజను	రూ. 195	రూ. 285
మతాబాలు కిలో	రూ. 400	రూ. 450
టపాసులు	రూ. 98	రూ. 122
సెర్చి లైట్లు (10)	రూ. 145	రూ. 175

రాజానగరం: చీకట్లను తరిమి వెలుగులు నింపే దీపావళి పండగ అంటే అందరూ ఆనందంగా జరుపుకుంటారు. ఇల్లంతా దీపాలు, మిలమిలలాడే బాణసంచా కాల్చుతూ చిన్నా పెద్దా అంంతా సంతోషాలను పంచుకుంటారు. అటువంటి పండగ సందడి జనావళిలో క్రమేపీ తగ్గుతూవస్తోంది. దీనికి ఎన్ని రకాల కారణాలు ఉన్నాగాని, ప్రధానంగా ఆర్థికపరమైన ఒడిదొడుకులే కారణమని చెప్పవచ్చు. బాణసంచా ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రతి అంగళిలోను ఇదే కనిపిస్తుంది. నియోజకవర్గంలో రాజానగరం, దివాన్‌చెరువు, శ్రీరామపురం, తోకాడ, పుణ్యక్షేత్రం, కోరుకొండ, సీతానగరం, రఘుదేవపురం, వంగలపూడి, గాదరాడ, మధురపూడి మున్నగు ప్రాంతాలలో దీపావళి సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటితోపాటు రాధేయపాలెం, దివాన్‌చెరువులలోనా హోల్‌సేల్ దుకాణంలో కూడా వీటి విక్రయాలు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండడం వలన బాణసంచా వ్యాపారుల్లో ఉండే జోష్‌ని రెట్టింపు చేసింది. అంతేకాక గత ఏడాది నూరు శాతం పైబడి విక్రయాలు సాగడంతో వ్యాపారులు రెట్టించిన ఉత్సాహంతో ఈ సంవత్సరం బాణసంచా నిల్వలు ఉంచారు. దుకాణాలు కూడా గతంలో కంటే పెరిగాయి. రాజానగరంలో గత ఏడాది రెండు దుకాణాలు వేస్తే, ప్రస్తుతం ఐదు దుకాణాలు వెలిశాయి. వీటిలో రెండు దుకాణాలను అనుమతులు లేవంటూ పోలీసులు తొలగించారు. కానీ పరదాల చాటు నుంచి విక్రయాలు సాగిపోతున్నాయి. చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, కాకర పువ్వొత్తులు, మతాబులు, టపాసులు దీపావళి బాణసంచా సామగ్రి కొనుగోలుకు ఏ దుకాణానికి వెళ్లిన ధరలు రెట్టింపయ్యాయి. కొనుగోళ్లు పెరగడంతో వ్యాపారులు ఒకరికొకరు పోటీ పడి మారీ ధరలు పెంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాగుతో సామాగ్రి తీసుకువెళ్లేందుకు వచ్చిన కొనుగోలుదారులు చేతి సంచి కూడా నిండక అసంతృప్తితోనే మార్కెట్ చేసుకుని ఇంటి ముఖం పడుతున్నారు. టపాసుల ధరలు గత ఏడాది కంటే 25 శాతం పైగానే పెరిగాయి.

శివ పూజకు వేళాయెె

- 14 నుంచి కార్తిక మాస పూజలు
- ముస్తాబవుతున్న శివాలయాలు



కొంకుదురులో త్రిముఖలింగేశ్వశరస్వామి



బిక్కవోలులో ప్రాచీన గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు: కార్తిక మాస పూజలకు శివాలయాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 14 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండడంతో ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. కార్తిక మాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైనది కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజామునే గోదావరి కాలువలో, సమీపంలోని చెరువుల్లోనూ పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో పూజలు నిర్వహిస్తుంటారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని శివాలయాల్లో ప్రతి సోమవారం, పౌర్ణమి, ఏకాదశి దినాల్లో స్వామికి రుద్రాభిషేకాలు, సహస్ర జ్యోతిర్లింగార్చన, లక్షబిల్వార్చన, కార్తిక జ్వాలాతోరణం తదితర పూజలు నిర్వహిస్తారు.
కార్తిక మాసంలో ప్రధానంగా బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో, ఊలపల్లి రోడ్డులోని కేదారేశ్వరస్వామి, కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న త్రిముఖలింగేశ్వరస్వామి, పందలపాకలో కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాలతో పాటు రంగంపేట మండలంలోని ముకుందవరం భద్రకాళీ సమేత విశ్వేశ్వరస్వామి, వడిశలేరులో కాశీవిశ్వేశ్వరస్వామి, పెదపూడి మండలం జి.మామిడాడ శివారు ఎల్ఎస్‌పురంలో భీమేశ్వరస్వామి, పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, అనపర్తిలో పురాతన ఆలయంగా ఖ్యాతి గాంచిన ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తుతారు. అందుకే ఆలయ కమిటీలు ఆయా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి.

ఎంతో పవిత్రమైన మాసం



కార్తిక మాసానికి ఎంతో పవిత్రత ఉంది. శివునికి ప్రీతిపాత్రమైన మాసం ఇది. ఈ నెలలో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. ఈ మాసంలో సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు.

– గరిమెళ్ల కాశీ విశ్వేశ్వరరావు(బుజ్జి), పండితుడు, పందలపాక

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



కొండగుంటూరులో భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు పంపిణీ చేస్తామని, నియోజకవర్గంలో ఇంకా మంజూరు అవని వారికి త్వరలోనే ఇస్తామని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొండగుంటూరు, కొండగుంటూరుపాకలులో పేదలకు పంపిణీ చేసే నివాస స్థలాల కోసం సేకరించిన భూములను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల్లో నివాస స్థలాల పంపిణీకి 444 మందిని అర్హులుగా గుర్తించారన్నారు. అలాగే పుణ్యక్షేత్రం, జి.యర్రంపాలెంలలో 574 మంది లబ్ధిదారులతో కూడిన జాబితా సిద్ధంగా ఉందన్నారు.

గోకవరంలో వై ఏపీ నీడ్స్ జగన్



గోకవరంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న నాయకులు

గోకవరం: స్థానిక సచివాలయం 1, 2 పరిధిలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, బద్దిరెడ్డి మెహర్‌బాబా, నరాలశెట్టి నర్సయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో లైసెన్స్ లేకుంటే చర్యలు

డీఎస్పీ కిషోర్‌కుమార్



రాజానగరంలో దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ కిషోర్‌కుమార్, పక్కన సీఐ కాశీవిశ్వనాథ్

రాజానగరం: బాణసంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక రావుల చెరువు గట్టున ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను శనివారం సందర్శించారు. అనుమతులు లేని రెండు దుకాణదారులపై కేసులు నమోదు చేశారు. తూర్పు, ఉత్తర మండలాల పరిధిలో 120 దుకాణాలకు అనుమతులున్నాయన్నారు. నిబంధనలు అనుసరించి దరఖాస్తు చేసుకున్న వారికి లైసెన్స్‌లు మంజూరు చేశామన్నారు. స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్ కూడా ఉన్నారు.

గ్రామాల్లో దీపావళి సందడి

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో దీపావళి సందడి నెలకొంది. బాణసంచా సామగ్రి అమ్మకాలకు అధికారులు స్థానిక సంత మార్కెట్‌లో స్థలాలు కేటాయించడంతో ఈ ప్రాంతం రద్దీగా మారింది. మందుగుండు సామగ్రి అమ్మకాలకు అధికారులు 14 షాపులకు లైసెన్సులు మంజూరు చేశారు. శనివారం దీపావళి సామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి.